
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు

5

బుధవారం 14 మే 2025

పశు వైద్యానికి మందులు కరువు

సకాలంలో మూగ జీవాలకు అందని చికిత్స

నెలలుగా నిలిచిన మందుల సరఫరా

ధారూర్ మండలంలో ప్రైవేట్‌ను ఆశ్రయిస్తున్న రైతులు



7

కుళ్లిన ఉల్లి
» అకాల వర్షానికి ఆగమాగం



అకాల వర్షాలు రైతులను ఆగమాగం చేస్తున్నాయి. మర్పల్లి మండలంలోని పంచలింగాలకు చెందిన రైతు మొగులయ్య ఎకరన్నర పొలంలో రూ.60వేల పెట్టుబడితో ఉల్లి సాగు చేశాడు. రెండు నెలల క్రితం ఆ పంట చేతికి వచ్చింది. మార్కెట్‌లో ధర లేకపోవడంతో కొన్ని రోజుల పాటు పొలం దగ్గర నిల్వ చేశాడు. ఇటీవల తరచూ కురిసిన వర్షాలకు 70 క్వింటాళ్ల ఉల్లి పంట పూర్తిగా కుళ్లిపోవడంతో రూ. లక్షల్లో నష్టం వాటిల్లిందని రైతు కన్నీరుమున్నీరవుతున్నాడు.

-మర్పల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి)

మేము సైతం
» అమరులైన జవాన్లకు ఘన నివాళి



'ఆపరేషన్ సిందూర్'లో అమరులైన జవాన్లకు నివాళులర్పిస్తూ వికారాబాద్ జిల్లా కేంద్రంలో 'మేము సైతం' నినాదంతో అశ్రునివాళి యాత్ర నిర్వహించారు . ఆలంపల్లి నుంచి ప్రారంభమై ఎన్టీఆర్ చౌరస్తా వరకు సాగిన ర్యాలీలో దేశభక్తి నినాదాలు మార్మోగాయి. ఇందులో విద్యార్థులు, డాక్టర్లు, ఉద్యోగులు, మాజీ సైనికులు, సామాన్య ప్రజలు, యువతతో పాటు రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జవాన్ల త్యాగాలను స్మరించుకుంటూ వారికి నివాళులర్పించారు. జై హింద్, వందే మాతరం నినాదాలతో ర్యాలీ, ప్రజల్లో దేశభక్తి భావనను మరింత నింపింది.

-వికారాబాద్, మే 13 (ఆంధ్రజ్యోతి)

తాగునీటి కటకట
» బోరుబావుల వద్దకు పరుగులు



ఎండ తీవ్రత పెరుగుతుండటంతో జిల్లాలో తాగునీటికి తిప్పలు పెరుగుతున్నాయి. చాలా గ్రామాల్లో తాగునీరు దొరక్క వ్యవసాయ మోటార్ల వద్దకు పరుగులు తీస్తున్నారు. తాండూరు మండల పరిధిలోని సంకిరెడ్డిపల్లిలో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. మిషన్ భగీరథ రావడం లేదని చెప్పినా అధికారులు పట్టించుకోని పరిస్థితి. చేతిపంపులు ఉన్నా భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో నీరు పైకి రావడం లేదని గిరిజన మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

-తాండూరురూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి)

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం
» శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్

» మోమిన్‌పేట్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



వెల్చాల్‌లో మహిళలతో మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

మోమిన్‌పేట్, మే 13 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. మంగళవారం మోమిన్‌పేట్ మండలంలో రూ.10 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ప్రజలకు ఎల్లవేళల అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాళ్లగూడుపల్లి నుంచి గుట్ట మీదితండా వరకు రూ.2.40కోట్లతో బీటీ రోడ్డు, ఉపాధిహామీ పథకంలో రాళ్లగూడుపల్లిలో రూ.15లక్షలు, లచ్చనాయక్ తండాలో రూ.20 లక్షలు, మోమిన్‌పేట్‌లో రూ.1.05కోట్లతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. అలాగే మోమిన్‌పేట్‌లో ఇందిరమ్మ ఇంటి నమూనా నిర్మాణానికి భూమి పూజ చేశారు. బిక్కారెడ్డి గూడెంకు రూ.3 కోట్లతో బీటీ రోడ్డు, మల్లారెడ్డి గూడెం నుంచి మొండి కట్ట వాడుక చెరువుకు రూ.16.85లక్షలతో మరమ్మతు పనులకు శంకుస్థాపన చేశారు. వెల్చాల్‌లో రూ.55 లక్షలు, దుర్గం చెరువులో రూ.50 లక్షలు, మొరంగపల్లిలో రూ.45 లక్షలు, ఇజ్రా చిట్టెంపల్లిలో రూ.30 లక్షలు, కేసారంలో రూ.30 లక్షలు, ఎన్కెపల్లిలో రూ.45 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్లను సైతం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ ఈఈ ఉమేశ్, తహసీల్దార్ మనోహరచక్రవర్తి, ఎంపీడీవో విజయలక్ష్మి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మన్నె శంకర్‌యాదవ్, సుభాష్‌గౌడ్, సిరాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో 1,054 దరఖాస్తులు

కీసర, మే13(ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా కీసర మండల వ్యాప్తంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులలో కీసర రెవెన్యూ పరిధిలో మొత్తం 1,054 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ అశోక్ తెలిపారు. భూ భారతి చట్టం అమలులో భాగంగా కీసర మండలాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా తీసుకొని సదస్సులు నిర్వహించిన విషయం తెలిసిందే. 5వ తేదీ నుంచి ఆయా ప్రాంతాలలో జరిగిన సదస్సులు మంగళవారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో భాగంగా గోధుమకుంట గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 35 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ అశోక్ తెలిపారు. వచ్చిన దరఖాస్తులను సమస్యల వారీగా విభజించి, భూ భారతి చట్టానికి లోబడి, ఉన్నత అధికారుల ఆదేశాలతో సమస్యలు పరిష్కారిస్తామని తహసీల్దార్ అశోక్ తెలిపారు.

హైదరాబాద్ - బీజాపూర్ హైవే విస్తరణ పనులపై మళ్లీ నీలినీడలు అలుముకున్నాయి. పర్యావరణ అనుమతులకు సంబంధించి తమ సూచనలు పట్టించుకోలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేసిన హరిత ట్రిబ్యునల్ తక్షణమే అన్ని పనులు నిలిపివేయాలని ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. మళ్లీ ఈఐఏ(ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ అసెస్) ఇవ్వాలని ఆదేశించింది. చెట్లు, వన్యప్రాణుల సంరక్షణ కోసం అలైన్‌మెంట్ మార్పులు చేసే అవకాశాలు పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. అప్పటివరకు అన్ని అనుమతులను తాత్కాలికంగా పక్కన పెడుతున్నట్లు పేర్కొంది. అయితే ఈ ఉత్తర్వులపై ఇంతవరకు ప్రభుత్వం నుంచి సరైన స్పందన లేదు. దీంతో ఈ రోడ్డు నిర్మాణ పనులు మళ్లీ మొదటికొచ్చినట్లయింది.



వర్షం పడితే చేవెళ్ల మండల పరిధిలో రోడ్డు దుస్థితి

బీజాపూర్ హైవేకు గ్రహణం!


- కోర్టు ఆదేశాలపై అధికార యంత్రాంగం మీమాంస
- భారీ వృక్షాలు రీప్లాంటేషన్‌పై కోర్టు అసంతృప్తి
- అలైన్‌మెంట్ మార్పును పరిశీలించాలని ఆదేశం
- అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు 4 లేన్ల విస్తరణకు బ్రేకులు
- రోజురోజుకూ పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు

గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలతో పనులకు బ్రేక్

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

నిత్యం రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ సమస్యలతో నరకప్రాయంగా ఉన్న హైదరాబాద్ - బీజాపూర్ హైవే విస్తరణను చేపట్టేందుకు ఐదేళ్ల కిందటే కేంద్రం అంగీకరించింది. ఈ రోడ్డును జాతీయ రహదారిగా గుర్తించి దీని విస్తరణ పనులకు కేంద్రం మొత్తం రూ.956 కోట్ల నిధులు విడుదల చేసింది. ఔటర్ రింగు రోడ్డు అప్పాజంక్షన్ నుంచి మన్నెగూడ వరకు 46 కి.మీ మేర నాలుగు లేన్ల రహదారి విస్తరణకు సంబంధించి భూసేకరణ చేసి రైతులకు నష్టపరిహారం కూడా దాదాపు అందించింది. ఈ రోడ్డు నిర్మాణ పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తిచేసింది. 'మేఘా' ఇన్‌ఫ్రా సంస్థ రూ. 786 కోట్లకు దక్కించుకుని రోడ్డు విస్తరణ పనులు మొదలు పెట్టింది. బైపాస్ రోడ్డు నిర్మాణాలను వేగవంతంగా చేపట్టింది. భూసేకరణ, భూముల చదును పనులు చకచకాసాగాయి. అయితే నిర్మాణ పనుల్లో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న భారీ వృక్షాలు తొలగిస్తున్నారంటూ పర్యావరణవేత్తలు ఎన్జీటీని ఆశ్రయించారు. దీనిపై 2023 చివరిలో

మిగతా 7వ పేజీలో...



ఇప్పటికైనా నిజాలు చెప్పండి



హైదరాబాద్ - బీజాపూర్ హైవే నిర్మాణ పనులపై ప్రభుత్వం ప్రజలకు నిజాలు చెప్పాలి. పనులు వెంటనే చేపడతామని అసెంబ్లీ సాక్షిగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హామీ ఇచ్చారు. ఎన్జీటీ నుంచి అన్ని అనుమతులు వచ్చాయన్నారు? ఇప్పుడు ఎన్జీటీ పనులు అన్ని పనులు నిలిపివేయాలని ఆదేశించింది. నిత్యం రోడ్డు ప్రమాదాలు జరిగి ఎంతో మంది మృత్యువాత పడుతున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదు. న్యాయస్థానం అనుమానాలను నివృత్తి చేసి వెంటనే అనుమతులు తీసుకుని పనులు చేపట్టాలి. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ త్వరలో ఈ ప్రాంత ప్రజలతో ఆందోళన కార్యక్రమాలు చేపడతాం.

-పి.కార్తీక్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు

ప్రశాంతంగా పాలిసెట్



సెంటర్ వద్ద విద్యార్థుల కోలాహలం

వికారాబాద్/మేడ్చల్ టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ పట్టణంలో మంగళవారం రెండు సెంటర్లలో నిర్వహించిన పాలిసెట్ ప్రశాంతంగా జరిగిందని జిల్లా కన్వీనర్ రవీందర్ తెలిపారు. పరీక్షకు గంట ముందే విద్యార్థులు సెంటర్ల వద్దకు చేరుకున్నారు. మొత్తం 1,400 మంది విద్యార్థులకు గాను 1,282 మంది హాజరుకాగా 1,18 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. అలాగే మేడ్చల్ జిల్లాలో మొత్తం 8 సెంటర్లలో 2,078 మంది విద్యార్థులకు గాను 1,798 మంది మాత్రమే పరీక్షకు హాజరయ్యారు. ఈ సందర్భంగా పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తును ఏర్పాటు చేశారు.

తూకం వేసి వెంటనే మిల్లులకు తరలించాలి

ధారూరు, మే13(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని తూకం వేసి వెంటనే మిల్లులకు తరలించాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం గట్టేపల్లి కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. తూకాలలో ఆలస్యంపై ఇన్‌చార్జి రవికుమార్‌ను ప్రశ్నించారు. జిల్లాలో 128 కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఇప్పటి వరకు 17,459 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు ఆయన తెలిపారు. అలాగే రూ.18 కోట్లు రైతులకు డబ్బులు చెల్లించామన్నారు. అంతకుముందు దోర్నాల్‌లో భూ భారతి రెవెన్యూ సదస్సులో ఆయన రైతులతో మాట్లాడారు. ఆయన వెంట ఆర్డీవో వాసచంద్ర, డీఎస్‌వో మోహన్ బాబు, డీటీసీఎస్ శ్రీనివాస్ గౌడ్‌లు ఉన్నారు.

ఉత్తీర్ణత పెంచడమే లక్ష్యం

ఇంటర్ ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

- వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా సందేహాల నివృత్తి
- మాదిరి పరీక్షల నిర్వహణతో చదువు అంచనా
- 22వ తేదీ నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

వికారాబాద్, మే 13(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేని విద్యార్థులను ప్రోత్సహించే విధంగా ఇంటర్ విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఉత్తీర్ణత సాధించని, చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ పరీక్షలు బాగా రాసే విధంగా ప్రోత్సహిస్తున్నారు. గతనెల 22న ప్రకటించిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో జనరల్, ఒకేషనల్ విభాగాలు కలిసి ప్రథమ సంవత్సరంలో 61.30 శాతం, ద్వితీయ సంవత్సరంలో 68.19 శాతం ఉత్తీర్ణత సాధించారు.

భారం తగ్గించేలా చర్యలు

జిల్లాలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం జనరల్ పరీక్షలకు 5,589 మంది విద్యార్థులు హాజరు కాగా, వారిలో 3,761 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా, 1,828 మంది ఫెయిల్ అయ్యారు. ప్రథమ సంవత్సరం పరీక్షలకు 6,418 మంది విద్యార్థులు హాజరవగా, వారిలో 3,820 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కాగా, 2,598 మంది

మిగతా 8వ పేజీలో...



ముఖ్యాంశాలు బోధిస్తూ..

ఈనెల 22వ తేదీ నుంచి ప్రారంభమయ్యే అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఎక్కువ శాతం ఉత్తీర్ణత నమోదయ్యేలా లెక్చరర్లు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఫెయిలైన విద్యార్థుల చదువులు మధ్యలో నిలిచిపోకుండా ఉండేందుకు ఇంటర్ విద్యా కమిషనర్ ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించిన విషయం తెలిసిందే.. దీంతో ఆయా విద్యార్థులకు ఆన్‌లైన్ పద్ధతిలో తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులతో ప్రత్యేక వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి పాఠ్యాంశాల్లోని ముఖ్యాంశాలను అధ్యాపకులు పోస్ట్ చేస్తున్నారు. ఏయే ప్రశ్నలకు ఏ విధంగా సమాధానాలు రాస్తే.. ఎన్ని మార్కులు వేసే అవకాశం ఉంటుందనేది కూడా విద్యార్థులకు వివరించి పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు.



హత్య కేసులో ముగ్గురికి జీవిత ఖైదు

వికారాబాద్, మే 13 (ఆంధ్రజ్యోతి): కోట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో 2014లో జరిగిన హత్యా కేసులో ముగ్గురు నిందితులకు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్, సెషన్స్ జడ్జి సున్నం శ్రీనివాస్‌రెడ్డి జీవిత ఖైదు విధించినట్లు ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. ఇందోల్ గ్రామానికి చెందిన బాసుపల్లి హన్మంతును అతని పాలివారైన అంజిలప్ప, కుమారులు శ్రీనివాస్, పాండు కలిసి 2014 డిసెంబర్ 4న రాత్రి 7 గంటల సమయంలో గొడవ పడి దారుణంగా హత్య చేశారు. మృతుడి అన్న పెంటప్పా ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ రమేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా, ఇన్‌స్పెక్టర్ శివశంకర్ చార్జిషీట్ దాఖలు చేశారు. న్యాయవాదులు నారాయణ గౌడ్, రవి కుమార్, సుధాకర్‌రెడ్డి, పోలీస్ అధికారులు గఫార్, రఘు, రాములు, మహేశ్వర్ రెడ్డి, వీరన్నల కృషితో నిందితులకు శిక్ష పడింది. దీంతో పోలీసులను ఎస్పీ అభినందించారు.

నత్తనడకన నీటి ట్యాంకుల నిర్మాణం

జిల్లాకు 11 తాగునీటి ట్యాంకులు మంజూరు

తాండూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): పబ్లిక్ హెల్త్ కింద జిల్లాకు మంజూరైన 11 తాగు నీటి వాటర్ ట్యాంకుల నిర్మాణం నత్తనడకన సాగుతోంది. మొదట్లో రక్షిత మంచి నీటి సరఫరా(ఆర్‌డబ్ల్యూఎస్) అధికారులు తాగునీటి సోర్స్‌కు సంబంధించి సమగ్ర వివరాలను సమర్పించలేదు. దీనికితోడు సంబంధిత ట్యాంకుల నిర్మాణానికి డిజైనింగ్, సాంకేతిక, సమస్యలు తీర్చేందుకు అధికారులు, కాంట్రాక్టర్‌ల మధ్య సమన్వయం లేని కారణంగా తీవ్ర జాప్యం జరిగింది. పరిగిలో 04, వికారాబాద్‌లో 02, కొడంగల్‌లో 02, తాండూరులో 03 చొప్పున మంజూరైన నీటి ట్యాంకులను నిర్మించేందుకు మెగా సంస్థ కాంట్రాక్ట్ తీసుకుంది. ఈ పనులను సబ్ కాంట్రాక్టర్లకు అప్పగించింది. అయితే ఇటీవల ట్యాంకుల నిర్మాణం తీవ్ర జాప్యం కారణంగా వికారాబాద్‌లో స్పీకర్ ప్రసాద్ కుమార్ అధ్యక్షతన సమీక్ష సమావేశం కూడా నిర్వహించారు. పనులు నతనడకన గల కారణాలపై ఆరా తీయగా సంబంధిత ట్యాంకులకు ఎక్కడి నుంచి తాగు నీటి సరఫరా చేస్తారు. ట్యాంకుల నిర్మాణానికి స్థలం అనుకూలంగా ఉందా లేదా అనే విషయాన్ని నీటి సరఫరా శాఖ తెలపని కారణంగా జాప్యం జరుగుతోందని గుర్తించిన స్పీకర్ అధికారుల తీరుపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సమీక్ష తర్వాత కొడంగల్, వికారాబాద్, పరిగిలో పనులు ఊపందుకోగా తాండూరులో మాత్రం మంజూరైన మూడు ట్యాంకుల్లో ఒక ట్యాంకు నిర్మాణం మాత్రమే కొనసాగుతోంది ఈ ట్యాంకుల నిర్మాణానికి సరిపడా నిధులున్నా నిర్మాణ జాప్యంపై ప్రజాప్రతినిధులు మండిపడుతున్నారు.



తాండూరు పట్టణం ఎన్‌టీఆర్ నగర్‌లో నిర్మిస్తున్న వాటర్ ట్యాంకు

చిట్టడవుల్లా క్రీడాప్రాంగణాలు

- నిర్వహణ లేక నిరుపయోగం
- బోర్డులే తప్ప మైదానాల్లో సౌకర్యాలు నిల్
- గ్రామానికో క్రీడా ప్రాంగణం ఏర్పాటు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

మొయినాబాద్ రూరల్, మే 13(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ప్రభుత్వం క్రీడామైదానాలను ఏర్పాటు చేసింది. ప్రతీ మైదానాన్ని కనీసం ఎకరం విస్తీర్ణంలో ఏర్పాటు చేసి బోర్డులు, ఆర్చ్‌లు పాతారు. అయితే వాటి నిర్వహణ లేక నిరుపయోగంగా మారిపోయాయి. క్రీడా ప్రాంగణాలు చెట్లు, పొదలతో నిండి చిట్టడవులను తలపిస్తున్నాయి. గ్రామీణ క్రీడా మైదానాల నిర్వహణ బాధ్యత గ్రామ పంచాయతీలదే. కానీ సిబ్బంది, అధికారులు వాటిని పట్టించుకోక నిరుపయోగంగా మారాయి. ఈ మధ్య కొందరు తమ సొంత స్థలాల్లో ప్రైవేట్ మైదానాలను ఏర్పాటు చేస్తున్నారు. వాటిని అన్ని హంగులతో నిర్మించి క్రీడాకారులకు, ఆటవిడుపు కోసం వచ్చే వారికి అద్దెకిస్తున్నారు. వాటిల్లో ఆటలాడాలంటే వేలల్లో డబ్బు చెల్లించాల్సి ఉంటుంది. అయితే గ్రామీణ క్రీడా ప్రాంగణాల్లో మాత్రం సౌకర్యాల్లేవు.



చెట్లు పొదలతో నిండిన హిమాయత్‌నగర్‌లో క్రీడా ప్రాంగణం



అజీజ్‌నగర్‌లో క్రీడా ప్రాంగణంలో చెట్లు, పొదలు

పట్టించుకునే నాథుడు లేడు...

మొయినాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ పథకం నిధులతో 15 క్రీడా మైదానాలను ఏర్పాటు చేశారు. వాటి నిర్వహణ లేక అస్తవ్యస్తంగా మారాయి. క్రీడా పరికరాలు లేవు. వాలీబాల్ ఆడాలంటే నెట్టు కట్టుకునే పోల్స్ కూడా పాతలేదు. వాటిల్లో క్రీడలు ఆడక చెట్లు, పొదలతో నిండాయి. క్రీడా ప్రాంగణాలన్నీ నిరుపయోగంగానే ఉన్నాయి. ఇది క్రీడా ప్రాంగణం అని చెప్పలేని పరిస్థితి ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం క్రీడామైదానాలను చదును చేసి అందుబాటులోకి తీసుకురావాలని క్రీడాకారులు, గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.

అధికారులు చొరవ చూపాలి



ప్రభుత్వం ఆట మైదానాలను ఏర్పాటు చేసింది. వాటి నిర్వహణను పట్టించుకునే వారు లేక ప్రాంగణాలు అధ్వానంగా మారాయి. క్రీడలపై ఆసక్తి ఉన్న వారు ప్రైవేట్ మైదానాల్లో డబ్బు చెల్లించి వెళ్తున్నాం. ఇప్పటికైనా అధికారులు క్రీడా మైదానాలను అందుబాటులోకి తేవాలి.

- మోర శ్రీనివాస్, క్రీడాకారుడు, రెడ్డిపల్లి

త్వరలోనే అందుబాటులోకి తెస్తాం

మొయినాబాద్ మండలంలో 15 మైదానాలున్నాయి. వీటి నిర్వహణ చూడాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలిస్తాం. ప్రభుత్వం సిబ్బందికి సర్వే, ఇతర పనులు అప్పగించింది. త్వరలోనే మైదానాలను అందుబాటులోకి తెస్తాం. వీటికి నిధులు కూడా అంతంత మాత్రంగానే వస్తాయి. ప్రస్తుతం మా దృష్టి ప్రజల దాహార్తి తీర్చడంపైనే ఉంది.

- సంధ్యారాణి, ఎంపీడీవో, మొయినాబాద్

కూతురు, అత్తపై కత్తితో దాడి

- గొంతు కోసుకుని వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మేడ్చల్ టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి): తాగిన మైకంలో ఓ వ్యక్తి తన కూతురు, అత్తపై కత్తితో దాడి చేసి తీవ్ర గాయాలపాలు చేశాడు. అనంతరం అదే కత్తితో తన గొంతు కోసుకుని ఇంటిపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికంగా కలకలం రేపిన ఈ ఘటన మండలంలోని నూతన్‌కల్ గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ మండలం నూతన్‌కల్ గ్రామంలోని ఓ అద్దె ఇంట్లో నివాసముంటున్న మహారాష్ట్రకు చెందిన శైలేందర్ అంబాదే(40) సోమవారం రాత్రి తప్పతాగి ఇంటికి వచ్చాడు. అనంతరం ఇంట్లో ఉన్న కూతురు హన్సాన్(12)పై కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఈ దురాగతాన్ని అడ్డుకునే యత్నం చేసిన శైలేందర్ అత్త రూమన్ సహరే(68) ఆమెపైనా అతడు దాడి చేశాడు. గాయపడ్డ వారు ఆరుపులు కేకలు వేయటంతో ఆదే కత్తితో తన గొంతు కోసుకున్నాడు. అనంతరం ఇంటిపై అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యాయత్నం చేశాడు. శైలేందర్ అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు అక్కడికి చేరుకుని శైలేందర్, హన్సాన్, సహరేలను సమీప ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కాగా ఈ ఘటనపై పోలీసులకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని తెలుస్తోంది.


కత్తిపోటుతో గాయపడిన హన్సాన్


స్పృహ కోల్పోయిన శైలేందర్

నకిలీ ఐస్‌క్రీమ్ తయారీదారుల అరెస్టు

కులకచర్ల, మే 13 (ఆంధ్రజ్యోతి): కులకచర్లలో నకిలీ ఐస్ క్రీమ్ తయారు చేసి విక్రయిస్తున్న ముగ్గురిని టాస్క్‌ఫోర్స్ ప్రత్యేక పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. పక్కా సమాచారంతో మంగళవారం టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడులు నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం పర్వతపురం గ్రామానికి చెందిన ఎండీ.అజీమ్ తపాల కార్యాలయం సమీపంలో ఇంటిని అద్దెకు తీసుకొని గడువు ముగిసిన పదార్థాలతో ఐస్‌క్రీమ్ తయారు చేస్తున్నాడు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన అనిల్, రాంపాల్‌తో విక్రయిస్తున్నారు. టాస్క్‌ఫోర్స్ దాడిలో గడువు ముగిసిన పదార్థాలను గుర్తించి వారిని పోలీసులకు అప్పగించారు. ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అన్వేష్‌రెడ్డి తెలిపారు.


నకిలీ ఐస్‌క్రీమ్ తయారు చేస్తూ పట్టుబడిన వ్యక్తులు

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

బొంరాస్‌పేట్, మే 13(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుటోందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం బొంరాస్‌పేట్ మండలం తుంకిమెట్లలో సీఆర్‌ఆర్ నిధులు రూ.20లక్షలతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు కాంగ్రెస్ నాయకులతో కలిసి భూమి పూజ చేశారు. గ్రామాలు, తండాల అభివృద్ధి కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సిములుగౌడ్, రాంచంద్రారెడ్డి, నర్సిములునాయుడు,గోవర్ధన్‌రెడ్డి, మల్లికార్జున్, కృష్ణ, దేశ్యానాయక్, బాల్‌రాజ్‌గౌడ్, అంజిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


భూమి పూజ చేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి

దివ్యాంగులకు అంత్యోదయ కార్డులివ్వాలి


డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రాజేశ్

దోమ, మే 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అర్హులైన దివ్యాంగులు అందరికీ అంత్యోదయ కార్డులు ఇవ్వాలని భారత దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి డీటీ నర్సిములుకు వినతిపత్రం ఇచ్చారు. దివ్యాంగులు ఎన్నో సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. తమిళనాడు ప్రభుత్వం పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో దివ్యాంగులకు రిజర్వేషన్‌లు కల్పించిన మాదిరిగా తెలంగాణలో దివ్యాంగులకు రిజర్వేషన్‌లు కల్పించాలన్నారు. విధంగా పింఛన్ రూ.6వేలకు పెంచడంతో పాటు ఆర్టీసీ బస్సుల్లో 100శాతం రాయితీతో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలన్నారు. బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పోతురాజు, దోమ మండల అధ్యక్షుడు చుక్కయ్య, నాయకులు లక్ష్మయ్య, చంద్రయ్య, మహేశ్ పాల్గొన్నారు.

భూ భారతి సదస్సుల్లో దరఖాస్తుల స్వీకరణ

ధారూరు, మే 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గురుదోట్ల, దోర్నాల్, కుమ్మర్‌పల్లి గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన భూ భారతి రెవిన్యూ సదస్సుల్లో 35 దరఖాస్తులు అందాయి. గురుదోట్ల, కుమ్మర్‌పల్లి సదస్సుల్లో వికారాబాద్ ఆర్డీవో వాసు చంద్ర పాల్గొని రైతుల దరఖాస్తులను పరిశీలించి మాట్లాడారు. వివిధ రకాల భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టంతో పరిష్కరించుకోవచ్చని రైతులకు చెప్పారు. గురుదోట్లలో 17 దరఖాస్తులు రాగా మిస్సింగ్ సర్వే నంబర్లు 2, భూ విస్తీర్ణం సవరణకు 5, పట్టాదారు వివరాల నమోదకు 6, సక్సెషన్‌కు2, డీఎస్ పెండింగ్‌కు2 దరఖాస్తులు వచ్చాయి. దోర్నాల్‌లో వచ్చిన 9 దరఖాస్తుల్లో ఇందులో మిస్సింగ్ సర్వే నంబర్లు 3, సక్సెషన్‌కు 2, భూ విస్తీర్ణం సవరణకు 4 దరఖాస్తులు అందాయి. కుమ్మర్‌పల్లిలో 9దరఖాస్తులు రాగా, మిస్సింగ్ సర్వే నంబర్లకు 2, ఇంటిపేరు మార్పునకు ఒకటి, సక్సెషన్‌కు 2, డీఎస్ పెండింగ్‌కు 1, ఇతర సమస్యలపై మూడు దరఖాస్తులు వచ్చాయని రెవిన్యూ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్లు సాజిదా బేగం, శ్రీనివాస్, డీటీ విజయేందర్, అధికారులు, రైతులు పాల్గొన్నారు.


కుమ్మర్‌పల్లిలో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో వాసుచంద్ర

సైనిక్ స్కూల్ ఏర్పాటే ధ్యేయంగా కృషి

కీసర రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో సైనిక్ స్కూల్ ఏర్పాటే ధ్యేయంగా కృషి చేస్తామని కాంతి కిరణ్ ఫౌండేషన్ ముఖ్య కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఏపీలోని కోరుకొండ, కలికిరిలోని సైనిక్ స్కూల్లలో తెలంగాణ విద్యార్థులకు ప్రవేశాలను నిషేధించడంతో ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థులు, వారి తల్లితండ్రులతో కలిసి మంగళవారం రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబులను కలిశారు. మంత్రి పొన్నం మాట్లాడుతూ తెలంగాణాలో సైనిక్ స్కూల్ ఏర్పాటుకు ప్రభుత్వం రకాల కృషి చేస్తోందన్నారు. రక్షణ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు ఫోన్‌చేసి ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ గత పదేళ్లలో సైనిక్ స్కూల్ ఏర్పాటుపై నిర్లక్ష్యం చేశారన్నారు. ఈ విషయాన్ని విద్యాశాఖ ప్రత్యేక కార్యదర్శి హరితకు వివరించారు. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో సైనిక్ స్కూల్ ఏర్పాటయ్యేంత వరకు పోరాటం చేస్తామన్నారు. రాష్ట్రంలో ప్రవేశపరీక్ష రాసిన 20వేల మంది విద్యార్థుల తరపున ప్రయత్నాలు చేస్తామన్నారు. అధికారులు, మంత్రులు రాష్ట్రంలో సైనిక్ స్కూళ్ల ఏర్పాటుకు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో లావణ్య, కల్యాణి, సంతోష్, మనోజ్, జాకబ్ పాల్గొన్నారు.


మంత్రి ప్రభాకర్‌తో మాట్లాడుతున్న ప్రతినిధులు

ముగిసిన క్రికెట్ టోర్నీ

- బహుమతులు అందజేసిన నాయకులు

తలకొండపల్లి,మే13(ఆంధ్రజ్యోతి): లింగరావుపల్లిలో వారం రోజులుగా నిర్వహిస్తున్న అండర్-14 క్రికెట్ టోర్నీ మంగళవారం ముగిసింది. వివిధ గ్రామాల పది టీంలు టోర్నమెంట్‌లో పాల్గొన్నాయి. ఫైనల్ మ్యాచ్‌లో లింగరావుపల్లి, దేవుని పడకల్ టీంలు తలపడ్డాయి. దేవునిపడకల్ టీం ఒక వికెట్ తేడాతో విజయం సాధించింది. విజేతకు జీనుకుంట్ల తిరుపతిగౌడ్ రూ.5వేల నగదు,షీల్డ్, రన్నర్‌కు మండల కో-ఆప్షన్ మాజీ సభ్యుడు ఇమ్రాన్ రూ. 3వేల నగదు, షీల్డ్‌ను అందజేశారు. క్రీడలు మానసిక వికాసానికి దోహద పడుతాయని వారు అన్నారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతిగౌడ్, మణికంఠ, రబ్బానీ, అంజయ్య, ఇమ్రాన్ పాల్గొన్నారు.


క్రీడాకారులకు షీల్డ్‌లు బహూకరిస్తున్న నాయకులు

SUPER HIT నేడే చూడండి



సంధ్య 70 ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
11.00,2.00,6.00,9.00

GEETHA FILM DISTRIBUTORS

విజయవంతమైన 2వ వారం



సుదర్శన్ - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.15,2.30,6.15,9.30
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound

ఈనెల 16న బ్రహ్మాండమైన విడుదల



సంధ్య 35ఎంఎం - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
లక్ష్మీకళ సినిప్లెక్స్ 70 ఎ/సి- మూసాపేట్
ఎ.ఎం.బి సినిమాస్ 70 - గచ్చిబౌలి
ఏషియన్ సత్యం 70 - అమీర్‌పేట్

GLOBAL CINEMAS RELEASE

"మెగాస్టార్ చిరంజీవి" నటించిన అలనాటి మేటి క్లాసిక్ చిత్రం "జగదేక వీరుడు అతిలోక సుందరి" మరల మీ ముందుకు



దేవి 70 ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
11.00,2.30,6.00,9.15
మహాలక్ష్మి 70 - కొత్తపేట 11.15,2.30,6.15,9.45
అంజలి 70 - సికింద్రాబాద్ 11.15,2.15,6.15,9.15
ఇంద్రనాగేంద్ర 70 ఎంఎం - కర్మన్‌ఘాట్ 11.00,6.00
వెంకటసాయి 70 - కీసర 11.00,2.00,6.00,9.00
శ్రీలక్ష్మి క.మం.- అల్వాల్ 11.30,2.30,6.30,9.30

GLOBAL CINEMAS RELEASE

కేరళలో "150 కోట్లు" కలక్షన్ చేసిన "సూపర్‌హిట్ చిత్రం"



లక్ష్మీకళ సినిప్లెక్స్ - మూసాపేట్ 11.15,6.15
ఏషియన్ సత్యం - అమీర్‌పేట్ 1.15,7.30
ఎ.ఎం.బి - గచ్చిబౌలి 1.15,7.15

DEEPA ARTS



సమావేశంలో మాట్లాడుతున్న కాంతయ్య

ఉపాధి కూలీల బిల్లులు వెంటనే చెల్లించాలి

చేవెళ్ల, మే 13(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ కూలీల బిల్లులు వెంటనే చెల్లి ంచాలని బీకేఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు కాంతయ్య అన్నారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం అనుబంధ బీకేఎంయూ నాలుగు మండలాల మహాసభను మంగళవారం చేవెళ్లలోని అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కూలీలు పని చేసేచోట కనీస సౌకర్యాలు కల్పించడం లేదని ఆరోపించారు. మంచినీరు టెంట్, హెల్త్‌కిట్, రవాణా వంటి సదుపాయాలు, అలాగే పనిముట్లు పారలు, గడ్డపారలు ఇవ్వడం లేదని మండిపడ్డారు. పెండింగ్ వేతనాలను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రామస్వామి, కార్యదర్శి సత్యనారాయణ, రైతు సంఘం జి ల్లా ప్రధాన కార్యదర్శి ప్రభులింగం, యూనియన్ జిల్లా అధ్యక్షుడు అంజయ్య, ప్రధానకార్యదర్శి జంగయ్య, మక్బూల్,యశోద, కుందన్‌బాయి, వెంకటేశ్, రాములు, మల్లేష్, నర్సింహులు, సత్యనారాయణ, నర్సింలు, జంగయ్య, సత్తిరెడ్డి, శ్రీనివాస్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



వార్షిక మహోత్సవంలో ప్రజలకు ఆశీస్సులు అందజేస్తున్న బిషప్‌లు

ఘనంగా ఫాతిమా మాత మహోత్సవం

కొత్తూర్, మే 13 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలోని ఫాతిమాపూర్‌లో వెలసిన ఫాతిమామాత వార్షిక మహోత్సవాన్ని క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. బిషప్ ప్రిన్స్ అంథోని, చర్చి ఫాదర్ సైమన్‌రెడ్డి ఆధ్వర్యంలో చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా బిషప్ మాట్లాడుతూ క్రైస్తవులకు శాంతి సందేశాలు వినిపించారు. ఫాతిమామాత ఉత్సవ విగ్రహంతో ఊరేగింపు నిర్వహించారు. వార్షిక మహోత్సవాలకు ఆయా ప్రాంతాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా ఫాతిమామాత చర్చిని విద్యుత్ దీపాలంకరణతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. కార్యక్రమంలో పలువురు మత గురువులు, మాజీ వార్డు సభ్యుడు అల్విన్‌రెడ్డి, దిలీప్‌రెడ్డి, మల్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, వినయ్, గ్రామస్తులు లూర్దురెడ్డి, యాగారెడ్డి, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఏకగ్రీవంగా ఎన్నికైన లియాఫీ నూతన కార్యవర్గం

లియాఫీ అధ్యక్షుడిగా వెంకట్‌రెడ్డి

వికారాబాద్, మే 13(ఆంధ్రజ్యోతి): లియాఫీ(ఎల్ఐసీ బ్రాంచ్ ఏజెంట్ల సంఘం) నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మంగళవారం లియాఫీ భవనంలో ఎల్ఐసీ బ్రాంచ్ ఏజెంట్ల సంఘం(లియాఫీ) 14వ సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కిచ్చన్నగారి వెంకట్‌రెడ్డి(చేవెళ్ల), ప్రధాన కార్యదర్శి విజయేందర్‌రెడ్డి, కోశాధికారి కేతావత్ పాండు, కన్వీనర్‌గా కృష్ణకుమార్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో లియాఫీ సీనియర్ నాయకులు సింగారపు శ్రీనివాస్, పూరి వెంకటేశం, ఎన్.బసవలింగం పటేల్, బీఎం చారి, బాలకృష్ణారెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, జగన్నాథ్‌రెడ్డి, కేఎస్ ఎన్.రెడ్డి, కృష్ణారెడ్డి, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్‌రెడ్డి, సుదర్శనం, కోశాధికారి సీనయ్య, బ్రాంచ్ పీఎస్‌లు శ్రీనివాస్, మాణిక్‌రెడ్డి, శేఖర్‌స్వామి, మనోహర్‌రెడ్డి, వివిధ ప్రాంతాల ఏజెంట్లు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీనివాసచారి

ఏకాగ్రతతో చదివితేనే మంచి మార్కులు

వికారాబాద్, మే 13(ఆంధ్రజ్యోతి): ఏకాగ్రత, ఇష్టంతో చదివితేనే పోటీ పరీక్షల్లో విజయం సాధిస్తారని విషయ నిపుణులు, ప్రముఖ మోటివేటర్ కె.శ్రీనివాసచారి అన్నారు. మంగళవారం వికారాబాద్లోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 'టెట్‌లో మంచి మార్కులు సాధించడం ఎలా?' అనే అంశంపై అభ్యర్థులకు పలు సూచనలు చేసి అవగాహన కల్పించారు. టెట్‌లో ప్రతీ మార్కు కీలకమన్నారు. పాఠ్యపుస్తకాలను సమగ్రంగా చదవాలని, ఎక్కడి నుంచి ప్రశ్నలొచ్చినా సమాధానం రాసేలా అవగాహన పెంచుకోవాలని సూచించారు. చదివే ప్రతీ అంశాన్ని ఆకళింపు చేసుకుంటనే సమాధానాలు రాయగలుగుతారన్నారు. పరీక్ష రాసేప్పుడు ఆత్మస్థైర్యం కోల్పోకూడదని, ఎక్కువ మార్కులు సాధిస్తానన్న విశ్వాసంతో రాయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సురేష్, ఉద్యోగులు లక్ష్మప్ప, ముంతాజ్, సరిత తదితరులు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న లావణ్యదేవేందర్‌యాదవ్

అంచలంచెలుగా సమస్యల పరిష్కారం

కొత్తూర్, మే 13(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో భూగర్భ మురుగు నీటి కాలువలను నిర్మిస్తూ క్రమంగా సమస్య పరిష్కరిస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ బాతుక లావణ్యదేవేందర్‌యాదవ్ అన్నారు. అక్కవానిగూడ 1వ వార్డులో రూ.5లక్షలతో నిర్మించే మురుగునీటి కాలవ పనులను ఆమె ప్రారంభించారు. మున్సిపాలిటీలో న్ని వార్డుల్లో డ్రైయిన్లు నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ డోలి రవీందర్, కౌన్సిలర్లు మాధవిగోపాల్‌గౌడ్, మాదారం నర్సింహాగౌడ్, కోస్గి శ్రీనివాస్, చంద్రకళరాజేందర్‌గౌడ్, సోమ్లనాయక్, జయమ్మజనార్దన్‌చారి, ప్రసన్నలతయాదయ్య, మాజీ ఎంపీటీసీ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజాపూర్ హైవేకు గ్రహణం!

(ఐదో పేజీ తరువాయి)

ఎన్జీటీ స్టే ఇచ్చి మూడు నెలల్లోగా నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించింది. అయితే అధికారులు సకాలంలో నివేదిక ఇవ్వలేదు. దీంతో ఎన్నికలకు ముందుగానే ఈ పనులు నిలిచిపోయాయి. స్థానిక రాజకీయ పరిస్థితులు కూడా ఇబ్బందికరంగా మారడంతో సదరు రోడ్డు నిర్మాణ సంస్థ నిర్మాణ సామగ్రిని ఇతర ప్రాంతాలకు తరలించింది.

మొక్కల రీప్లాంటేషన్‌పై అభ్యంతరాలు

ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రహదారి విస్తరణ పనులపై తొలుత హడావిడి చేసింది. రాష్ట్ర రోడ్డు రవాణాశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్థానిక ఎమ్మెల్యేలను తీసుకుని కేంద్ర రోడ్డు, రవాణాశాఖ మంత్రి గడ్కరీని కలిశారు. సీఎం రేవంత్‌రెడ్డి కూడా పలుమార్లు ఉన్నతాధికారులతో సమీక్షలు నిర్వహించారు. ఎన్జీటీ అభ్యంతరాలపై నిపుణులతో చర్చించి కోర్టుకు నివేదిక పంపారు. తరువాత కేంద్రం నుంచి అన్ని అనుమతులు వచ్చాయని, ఎన్జీటీ ఆదేశానుసారంగా రహదారి విస్తరణలో అడ్డుగా ఉండే భారీ వృక్షాలను రీ ప్లాంటేషన్ చేస్తామని ప్రభుత్వం తెలిపింది. సీఎం రేవంత్‌రెడ్డి గతంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో బీజాపూర్ హైవే పనుల పురోగతిని ప్రత్యేకంగా సమీక్షించారు. రోడ్డు విస్తరణలో తొలగించే భారీ వృక్షాలను రీప్లాంటేషన్ చేయాలని సూచించారు. ఇదిలాఉంటే భారీ వృక్షాల రీప్లాంటేషన్ ఇతర పర్యావరణ అంశాలపై అధికారులు ఇచ్చిన నివేదికను ఎన్జీటీ తప్పుపట్టింది. రీ ప్లాంటేషన్ తర్వాత ఎన్ని వృక్షాలు బతికాయి? అనే వివరాలపై నివేదిక కోరింది. మళ్లీ ఈఐఏ(ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ అసెస్) ఇవ్వాలని అప్పటివరకు అన్ని అనుమతులు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు తెలిపింది. దీంతో మళ్లీ కథ మొదటికి వచ్చింది? ఈ రోడ్డు నిర్మాణ పనులకు టెండర్లు వేసి ఇప్పటికే రెండున్నరేళ్లుదాటింది. నిర్మాణ పనులు దక్కించుకున్న సంస్థ గతంలో కోట్‌చేసిన ధరకు పనులు చేసే అవకాశాలు ఉండవు. దీంతో మళ్లీ అంచనాలు పెంచాల్సి ఉంటుంది. ఇదంతా చూస్తే హైదరాబాద్-బీజాపూర్ హైవే పనులు ఇప్పట్లో మొదలవుతాయా? లేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఈఐఏ ఎవరు చేయాలి?

ఎన్జీటీ తాజా ఆదేశాలతో మళ్లీ ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ అసెస్ ఎవరు చేయాలనేది ప్రశ్నార్థకరంగా మారింది. గతంలో ఈ పనులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు భవనాల శాఖ ద్వారా ఈఐఏ చేసింది. అయితే ఈ రోడ్డును జాతీయ రహదారిగా మార్చి నిర్మాణ పనుల బాధ్యత కేంద్రం తీసుకుంది.



చేవెళ్ల మండలంలో ఇరుకుగా బీజాపూర్ రహదారి

దీంతో ఇప్పుడు ఎన్జీటీ ఆదేశాల మేరకు ఈఐఏ నివేదిక కేంద్ర రోడ్డు భవనాల శాఖ ఇవ్వాలా? రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ ఇవ్వాలా? అనేదానిపై మల్లగుల్లాలు జరుగుతున్నాయి. కొత్తగా ఎన్జీటీ ఇచ్చిన ఆదేశాల్లో అసలు అలైన్‌మెంట్ మీదే వ్యాఖ్యలు చేసింది. చెట్లు, వన్యప్రాణుల సంరక్షణ కోసం మేలైన విధంగా అలైన్‌మెంట్ మార్పులు చేసే అవకాశాలు పరిశీలించమంది. జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జడ్ఎస్ఐ) ద్వారా అధ్యాయనం చేసి నివేదిక ఇవ్వాలని కోరింది. ఈ నేపథ్యంలో మళ్లీ ఈఐఏ ఎలా చేయాలనేదానిపై అధికారులు తర్జన భర్జన పడుతున్నారు.

పశువైద్యానికి మందులు కరువు

ధారూరు, మే13(ఆంధ్రజ్యోతి): పశువుల, పెంపుడు జంతువుల వైద్యానికి అవసరమైన మందులు అందుబాటులో గ్రామాల్లో మూగ జీవాలకు వైద్యం అందడం లేదు. కొన్ని నెలలుగా పశువైద్యశాలకు మందుల సరఫరా నిలిచి మందుల కొరత ఏర్పడింది. ఉన్న నామమాత్ర మందులతో సిబ్బంది పశువులకు వైద్యం చేస్తున్నారు. అయోడిన్ ద్రావణం కూడా పశువైద్యశాలల్లో లేదు. ధారూరు పశు వైద్యశాలలో అవసరమైన మందులు లేక రైతులే మెడికల్ షాపుల్లో కొనుక్కొచ్చి పశువులకు వైద్యం చేయిస్తున్నారు. పశువులు, మేకలు, గొర్రెలు, కోళ్లు, కుక్క, పిల్లి వంటి పెంపుడు జంతువులకు వైద్యం అందించేందుకు అవసరమున్న



ధారూరులోని వెటర్నరీ ఆస్పత్రి

మందులు వైటర్నరీ ఆస్పత్రుల్లో లేవు. వివిధ రోగాలకు, సీజనల్ వ్యాధులకు వైద్యం సక్రమంగా అందడం లేదని రైతులు వాపోతున్నారు. పశు వైద్యశాలల్లో పెన్సిలిన్, మెలనెక్స్ ఏవిల్, హైపోక్లోర్, ప్రెడినిసోలోన్, ఎన్రో ఇంజక్షన్లు, అయోడిన్, టర్పెంటాయిల్ వంటి నిత్యం అవసరం అయ్యే మందుల నిల్వలు రెండు నెలలుగా లేవు. అరకొరగా ఉన్న ఆక్సీటెట్రాసైక్లిన్, న్యూరాక్సిన్, బెర్నిల్, హైటెక్, క్యాల్-డి లాంటి మందులతో పశువులకు వైద్యం చేస్తున్నారు. అవసరమైన మందులు లేక రైతులు మెడికల్ షాపుల్లో వందలాది రూపాయలు వెచ్చించి తీసుకొస్తే వాటిని వైద్యులు, కాంపౌండర్లు పశువులకు ఇస్తున్నారు. మందుల కొరతపై మండల పశువైద్యాధికారి కుమారస్వామి స్పందిస్తూ.. పశువైద్యశాలకు కొన్ని మందుల సరఫరా లేదని చెప్పారు. అవసరమైన కొన్ని మందులు, ఇంజక్షన్లు అందుబాటులో లేవన్నారు. ఉన్నతాధికారులకు ఇండెంట్ పెట్టామన్నారు. ఉన్న మందులతో పశువులకు వైద్యం చేస్తున్నామని చెప్పారు. లేనివి మెడికల్ షాపుల్లో రైతులు కొని తెచ్చుకుంటున్నారని తెలిపారు.

నేతల హౌస్ అరెస్టు
అప్రజాస్వామికం

వికారాబాద్, మే 13(ఆంధ్రజ్యోతి): ప్రపంచ సుందరి పోటీల నిర్వహణపై ఉద్యమిస్తున్న మహిళా సంఘాల నేతలను హైదరాబాద్‌లో ఎక్కడికక్కడ గృహ నిర్బంధాలు చేయడం అక్రమం అని ప్రగతిశీల మహిళా సంఘం(పీఓడబ్ల్యూ) రాష్ట్ర కార్యదర్శి వై.గీత అన్నారు. మంగళవారం పట్టణంలో ఆమె మాట్లాడుతూ.. మహిళల అంగ ప్రదర్శనను ప్రోత్సహించే ఇలాంటి పోటీలు రాష్ట్ర సాంస్కృతిక విలువలను నాశనం చేస్తాయన్నారు. తెలంగాణలో విశ్వసుందరి పోటీలు నిర్వహించొద్దని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్రం ఈ పోటీల కోసం రూ.300కోట్లు ఖర్చు చేయడం అవివేకం అన్నారు. ఈ కార్యక్రమాన్ని నిరసిస్తున్న ప్రజాసంఘాల, ఐక్యవేదికల నాయకులు సంధ్య, మల్లు లక్ష్మి, తదితరులను పోలీసులు హౌస్ అరెస్టు చేయడం అప్రజాస్వామికమని అన్నారు.

నేవీ రాడార్ స్టేషన్‌కు భూమి అప్పగింత అన్యాయం

రాంనగర్/యాచారం, మే 13(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా రామగుండం అటవీ ప్రాంతాన్ని నేవీ రాడార్ స్టేషన్ నెలకొల్పేందుకు అప్పగించడం అన్యాయమని టీపీజేఏసీ కన్వీనర్ ప్రొఫెసర్ హరగోపాల్, ప్రజాశాస్త్రవేత్త బాబూరావు, టీపీజేఏసీ కోకన్వీనర్లు రవి, నాగయ్య, రవిచంద్ర, మైసా శ్రీనివాస్, డా.వనమాల అన్నారు. తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో.. 'తెలంగాణలో కొనసాగుతున్న అభివృద్ధి నమూనా ప్రజానుకూలమేనా?' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఎన్ఏపీఎం జాతీయ కమిటీ సభ్యులు మీరా సంఘమిత్ర, డీబీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పి.శంకర్, ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు కవుల సరస్వతి తదితరులు హాజరయ్యారు. వక్తలు మాట్లాడుతూ.. ఫార్మాసిటీ ఇథనాల్ కంపెనీలు థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులు కాలుష్యకారక



సమావేశంలో మాట్లాడుతున్న హరగోపాల్

పరిశ్రమలని, వాటిని తెలంగాణలో ప్రోత్సహించొద్దని, ఇప్పటికే ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి నమూనా దారి తప్పిందన్నారు. భూసేకరణకు 2013 చట్టానికి బదులు 2017 భూసేకరణ చట్టాన్ని అమలు చేయడం అన్యాయం అన్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ లాంటి మూడు నగరాల మధ్యలో ఫ్యూచర్‌సిటీ అవసరమా అని ప్రశ్నించారు. ఇందుకు 35వేల ఎకరాల భూసేకరణ చేయడం అన్యాయమన్నారు. ఈ ప్రతిపాదనలను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మహిళా రైతుల హక్కుల వేదిక నాయకులు ఆశాలత, రైతు స్వరాజ్య వేదిక ప్రతినిధి కిరణ్‌కుమార్, ఫార్మాసిటీ చిత్తనూరు ప్రాంత రైతులు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

యువ వికాసం దరఖాస్తుల
పరిశీలన పూర్తి

చౌదరిగూడ, మే 13(ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం స్కీంకు దరఖాస్తు చేసుకున్న వారు సిబిల్ స్కోర్ చెకింగ్ కోసం వారి ఆధార్, పాన్‌కార్డులను బ్యాంకుల్లో అందించాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ సూచించారు. మంగళవారం జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిషత్‌లో బ్యాంకు అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే దరఖాస్తుల పరిశీలన పూర్తిచేసి వివరాలను బ్యాంకు అధికారులకు అందజేశామని చెప్పారు. కార్యక్రమంలో ఏంపీవో హన్మంతరెడ్డి, ఏపీఎం నరసింహ, కార్పొరేషన్ సిబ్బంది



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్

రాజు, వీరప్రసాద్, నయూమ్, బ్యాంకు అధికారులు హరికృష్ణ, అశోక్, శ్రవణ్, ప్రియాంక, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పార్టీ పునర్‌వైభవానికి కృషిచేయాలి



పార్టీ పదవులకు పేర్లను స్వీకరిస్తున్న అశోక్‌గౌడ్

కీసర, మే13(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ పునర్‌వైభవానికి ప్రతీ ఒక్కరు కృషిచేయాలని మాల్కాజ్‌గిరి పార్లమెంటరీ నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడు కందికంటి అశోక్‌గౌడ్ అన్నారు. మంగళవారం నాగారం మున్సిపల్ పరిధి భోగారం అన్నపూర్ణ ఫంక్షన్ హాల్లో మేడ్చల్ నియోజకవర్గం ఇన్‌చార్జి సుంకరి వెంకటేశ్ అధ్యక్షతన స్థాయీ సమావేశం జరిగింది. ముఖ్య అతిథి అశోక్‌గౌడ్ మాట్లాడుతూ.. నగరానికి చేరువలోనే ఉన్న మేడ్చల్ జిల్లాలో గ్రామాలన్నీ పట్టణాలుగా రూపాంతరం చెందాయన్నారు. అన్ని గ్రామాలు మున్సిపాలిటీల్లో విలీనం అయ్యాయన్నారు. ప్రస్తుతం జిల్లా ఎక్కువ శాతం జీహెచ్ఎంసీలో భాగంగా ఉందని, అలాగే 9మున్సిపాలిటీలున్నాయని తెలిపారు. పార్టీ పటిష్టానికి త్వరలోనే మున్సిపాలిటీల్లో పార్టీ అధ్యక్షులను, ప్రధాన కార్యదర్శులను నియమిస్తామని అశోక్ గౌడ్ తెలిపారు. ఇప్పటికే నాయకుల పేర్లను నమోదు చేశామని, వివరాలను అధిష్టానానికి పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో సతీశ్, హరికృష్ణ, వేము సంజీవ, జంగారెడ్డి, వెంకటరమణ, మహేశ్, సురేందర్, మీనయ్య, శంకరయ్య, కృష్ణారావు, టి.శంకర్, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

దేవునిగుట్టపై సత్యనారాయణ వ్రతాలు

కందుకూరు, మే 13(ఆంధ్రజ్యోతి): ఉట్లపల్లిలోని దేవునిగుట్టపై లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సత్యనారాయణ వ్రతాలు చేశారు. నిర్వాహకులు తేరటి లక్ష్మణ్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో పండితులు రేవెళ్ల రాజుశర్మ నేతృత్వంలో స్వామి వారికి పూజలు నిర్వహించారు. ప్రతి సంవత్సరం ఐదు రోజులు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు లక్ష్మణ్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు రవి, సుధాకర్, అనిల్, చెన్నయ్య, మహేందర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఉట్లపల్లిలో సత్యనారాయణ వ్రతంలో భక్తులు



ఎల్లమ్మ కల్యాణ మహోత్సవంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

ఎలిమినేడులో ఎల్లమ్మ కల్యాణోత్సవం

ఇబ్రహీంపట్నం, మే 13 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండల పరిధి ఎలిమినేడులో మంగళవారం రేణుకా ఎల్లమ్మ కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఉత్సవంలో పాల్గొని పూజలు చేశారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆయన ప్రార్థించారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి మరిన్ని పరిశ్రమలను తీసుకొస్తామని, యువతకు ఉపాధి కల్పిస్తామని ఆయన అన్నారు. నాయకులు మంకాల శేఖర్‌రెడ్డి, ఈసీ శేఖర్‌గౌడ్, బి.మహిపాల్, జడల రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బోనాలతో ఆలయానికి తరలుతున్న భక్తులు

ఘనంగా కొత్లాపూర్ రేణుకా ఎల్లమ్మ జాతర

- మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

తాండూరురూరల్, మే 13(ఆంధ్రజ్యోతి): తెలంగాణ-కర్ణాటక సరిహద్దుకొత్లాపూర్ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో జాతర ఘనంగా కొనసాగుతోంది. జాతర మొదటి మంగళవారం సందర్భంగా కర్ణాట ప్రాంత భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కొందరు ఆలయ ప్రాంగణంలో వేపచీర ధరించి బోనాలతో మొక్కులు చెల్లించారు. మరికొందరు గండజ్యోతి ప్రదక్షిణలు చేశారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కళకళలాడింది. తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి అమ్మవారిని దర్శించుకుని ఏర్పాట్లను పరిశీలించారు. ఆలయ ప్రాంగణంలో 16సీసీ కెమెరాలు, కొత్లాపూర్‌లో 10సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని ఎస్సై విఠల్‌రెడ్డిని ఆయన ఆదేశించారు. ఆలయ కమిటీ చైర్మన్ నవీన్‌రెడ్డి, ఎండోమెంట్ ఈవో శేఖర్‌గౌడ్ డీఎస్పీ, ఎస్సైలను సన్మానించారు. భక్తులకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆలయ నిర్మాణ దాత, కర్ణాటక విద్యాశాఖ మాజీ మంత్రి అరవింద లింబావళి తన అనుచరులను పంపించారు.



ఇస్మాయిల్‌ఖాన్‌గూడలో కల్యాణాన్ని జరిపిస్తున్న పూజారులు

కనులపండువగా ఎల్లమ్మ, జమదగ్నిల పరిణయం

ఘట్‌కేసర్, మే 13(ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ పరిధి ఇస్మాయిల్‌ఖాన్‌గూడలో రేణుక ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం 36వ వార్షికోత్సవ పూజలను ఘనంగా నిర్వహించారు. ఎల్లమ్మ, జమదగ్నిల కల్యాణాన్ని ఘనంగా జరిపించారు. పూజలకు ఇస్మాయిల్‌ఖాన్‌గూడ, రాంపల్లి, వివిధ కాలనీల ప్రజలు పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే ఎం.సుధీర్ రెడ్డి, డీసీసీ చైర్మన్ సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, నాయకులు మహేశ్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, అశోక్, శ్రీశైలం పాల్గొన్నారు.

ఉత్తీర్ణత పెంచడమే లక్ష్యం

(ఐదో పేజీ తరువాయి)

ఫెయిల్ అయ్యారు. ఒకేషనల్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 1,200 మంది విద్యార్థులకు 869 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కాగా, 331 మంది ఫెయిలైన విషయం తెలిసిందే. ప్రథమ సంవత్సరం పరీక్షలకు 1,496 మంది విద్యార్థులు హాజరైతే వారిలో 1,032 మంది ఉత్తీర్ణత సాధించగా, 464 మంది ఫెయిల్ అయ్యారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులపై భారం తగ్గించేందుకు ఇంటర్ విద్యాశాఖ చర్యలు చేపట్టింది.

ఆన్‌లైన్‌లో ప్రత్యేక తరగతులు

ఇంటర్‌లో ఫెయిలైన ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు ప్రత్యేక తరగతులు కొనసాగుతున్నాయి. ఫెయిలైన విద్యార్థులను సబ్జెక్టు వారీగా వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి విద్యార్థులకు పాఠాల్లోని ముఖ్యాంశాలను బోధిస్తున్నారు. మాదిరి పరీక్షలు నిర్వహిస్తూ విద్యార్థుల చదువులను అంచనా వేస్తున్నారు. ముఖ్యమైన ప్రశ్నలు చెబుతూ వాటికి విద్యార్థుల నుంచి సమాధానాలు రాబడుతున్నారు.

ఆటోనగర్ ఏర్పాటు చేయిస్తా: ఎమ్మెల్యే



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

తాండూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆటోనగర్ లేకపోవడం వల్ల ఇబ్బందులు వస్తున్నాయని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టికి మెకానిక్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం తీసుకురాగా అసోసియేషన్ సభ్యుల విన్నపం మేరకు జిల్లా కలెక్టర్‌తో చర్చించి హైదరాబాద్ రోడ్డు మార్గంలో త్వరలో ఆధునాతన వసతులతో ఆటోనగర్‌ను అందుబాటులోకి తీసుకువస్తానని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి హామీ ఇచ్చారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో గురువులు, పూర్వ విద్యార్థులు

పరిగి, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టకోడూరు జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మంగళవారం పూర్వవిద్యార్థుల సమ్మేళనాన్ని జరుపుకున్నారు. 2006-07లో టెన్త్ విద్యను అభ్యసించిన విద్యార్థులు 18 ఏళ్ల తర్వాత కలుసుకుని తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అప్పటి హెచ్ఎం ఈ.విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు శ్రీధర్‌రెడ్డి, వెంకటేశ్‌గౌడ్, మాణిక్యం, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

వలసదారులను వెనక్కి పంపాలి



పరిగి పీఎస్‌లో ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

పరిగి, మే 13 (ఆంధ్రజ్యోతి): పరిగి పరిసర ప్రాంతాల్లో ఉంటున్న పాకిస్తాన్ వలసదారులను వెనక్కి పంపించాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం పరిగి పీఎస్, తహసీల్దార్, మునిసిపల్ కార్యాలయాల్లో వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు కె.రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. పాకిస్తాన్ అక్రమ వలసదారులు ఉంటే శాంతిభద్రతలకు విఘాతం కల్గించే అవకాశం ఉందన్నారు. వినతిపత్రాలు ఇచ్చినవారిలో బీజేపీ జిల్లా కార్యదర్శులు రాంచందర్, వి.పెంటయ్యగుప్త, మహిళా మోర్చా కార్యదర్శి అనసూయ, పట్టణ అధ్యక్షుడు బాలకృష్ణ, మండల అధ్యక్షుడు అంజనేయులు, నాయకులు నర్సింహులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు రానివ్వొద్దు



పంచాయతీలో రికార్డులు పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి

బషీరాబాద్, మే 13 (ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా గ్రామంలో నీటి సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడూ తగిన చర్యలు తీసుకోవాలని అల్లాపూర్ గ్రామ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ వై.వెంకటేశ్ కార్యదర్శికి సూచించారు. అల్లాపూర్ గ్రామ పంచాయతీని మంగళవారం సందర్శించిన ఆయన కార్యదర్శితో రికార్డులు తెప్పించుకుని పరిశీలించారు. గ్రామసమస్యలపై ఆరా తీస్తూ కార్యదర్శికి పలు సూచనలు చేశారు. అనంతరం నర్సరీని పరిశీలించారు. అదేవిధంగా బషీరాబాద్‌లోని రేషన్ దుకాణాన్ని తనిఖీ చేశారు. రేషన్ స్టాక్, రికార్డులను పరిశీలించారు. నిర్ణీత సమయంలో బియ్యం పంపిణీ చేస్తూ లబ్ధిదారులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని డీలర్‌ను ఆదేశించారు.

ఇంగ్లిష్ తప్పనిసరిగా భావించాలి



రంగాపూర్‌లో ప్రారంభమైన స్పోకెన్ ఇంగ్లిష్ క్లాసులు

పరిగి, మే 13 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో స్పోకెన్ ఇంగ్లిష్ తప్పనిసరిగా భావించాలని కెరెల్లి సత్యసాయి సేవాకేంద్రం ఇన్‌చార్జి ప్రేమ్‌కుమార్, రంగాపూర్ ఇన్‌చార్జి సోలిపేట్ వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని రంగాపూర్‌లోని సత్యసాయికేంద్రంలో మంగళవారం స్పోకెన్ ఇంగ్లిష్, బాలవికాస తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేసవి సెలవుల్లో గ్రామీణ విద్యార్థులకు ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఇంగ్లిష్‌లో ప్రావీణ్యం లేకపోతే సమాజంలో నిలదొక్కుకునే పరిస్థితి లేదన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దుద్యాల, మే 13 (ఆంధ్రజ్యోతి): దుద్యాల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, చెట్ల నరికివేత కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ఆనంద్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దుద్యాల, అల్లిఖాన్‌పల్లి, వాల్యానాయక్ తండా, లగచర్ల గ్రామాల్లో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

తాగునీటికి తండ్లాట

- సంకిరెడ్డిపల్లి తండాలో తాగునీటి కటకట
- వ్యవసాయ బావులను ఆశ్రయించి కాలం వెళ్లదీస్తున్న గిరిజనులు
- పట్టించుకోని ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులు

తాండూరు రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంకిరెడ్డిపల్లి, సంకిరెడ్డిపల్లితండాలో ప్రజలు నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. నెల రోజులుగా దారునిబాయి తండాలో ఉన్న బోరుమోటారు కాలిపోవడంతో సంకిరెడ్డిపల్లి గ్రామస్తులతోపాటు సంకిరెడ్డిపల్లి గిరిజనులు తాగునీటి కోసం నానాఅవస్థలు పడుతున్నారు. ఇటు మిషన్ భగీరథ నీరు పూర్తిగా రాకపోవడం, అటు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పట్టించుకోకపోవడంతో సంకిరెడ్డిపల్లి గ్రామస్తులు నీటిఎద్దడిని ఎదుర్కొంటున్నారు. గ్రామ సమీపంలోని రైతు జనుముల లక్ష్మి, కుర్వ మొగులప్ప, రసూల్ వ్యవసాయ పొలాల్లోని బోరుబావుల నుంచి



తాండూరు మండలం సంకిరెడ్డిపల్లిలోని వ్యవసాయ బోరు నుంచి నీటిని తెచ్చుకుంటున్న గ్రామస్తులు

కొంతమంది నీటిని తెచ్చుకుంటుండగా, మరికొందరు తండా సమీపంలోని దేవదాసు వ్యవసాయ బావి, జయసింగ్ వ్యసాయ పొలంలోని బావి నుంచి నీటిని తెచ్చుకుని కాలం వెళ్లదీస్తున్నారు. నీటి సమస్యపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రణీత్ ఫోన్‌చేసినా స్పందించడం లేదని సంకిరెడ్డిపల్లి మాజీ ఉపసర్పంచ్ రాంశెట్టి తెలిపారు. ఇప్పటికైనా మిషన్ భగీరథ ఉన్నతాధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారులు స్పందించి తండావాసుకు, గ్రామస్తులకు నీటిని సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

నీటి సమస్యను ఎవరూ పట్టించుకోవడం లేదు



సంకిరెడ్డిపల్లి గ్రామంతో పాటు సంకిరెడ్డిపల్లి తండాలో 20రోజులుగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. బోరుబావుల్లో నీరు అడుగంటిపోయాయి. గ్రామానికి మూడు కిలో మీటర్ల దూరంలోని దారునివాగు తండా నుంచి సరఫరాచేసే బోరు మోటారు కాలిపోవడంతో తాగునీటి సమస్య తీవ్రమైంది. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి. లేదంటే తాండూరు ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తాం.

- రాంశెట్టి, మాజీ ఉపసర్పంచ్ సంకిరెడ్డిపల్లి

నజీరాబాద్‌తండాలో నీటి ఇబ్బందులు

పరిగి: పరిగి మునిసిపల్ పరిధిలోని నజీరాబాద్ తండావాసులు తాగునీటి ఇబ్బందులు పడుతున్నారు. వారం, పదిరోజుల నుంచి మిషన్‌భగీరథ నీరు సరఫరా కావడం లేదని తండా వాసులు వాపోతున్నారు. అయితే సింగిల్‌ఫేజ్ బోర్లు ఉన్నా ప్రయోజనంలేదని చెబుతున్నారు. సింగిల్‌ఫేజ్ బోర్లలో కూడా నీరు ఇంకిపోయిందని, చిన్నగా నీరు రావడంతో తండావాసులకు సరిపోవడం లేదని చెబుతున్నారు. నీళ్లకోసం ఖాళీ బిందెలతో గంటల తరబడి నిరీక్షించినా ఫలితం ఉండటంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని తండావాసులు కోరుతున్నారు.



పరిగి: నజీరాబాద్‌తండాలో తాగునీటి ఇబ్బందులు

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

కులకచర్ల, మే 13 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో రూ.89లక్షలతో సీసీరోడ్డు నిర్మాణాలకు మంగళవారం భూమిపూజ చేశారు. అల్లాపూర్‌లో రూ.5లక్షలు, రాంరెడ్డిపల్లిలో రూ.10లక్షలు, ముజాహిద్‌పూర్‌లో రూ.23లక్షలు, దాస్యనాయక్ తండాలో రూ.5లక్షలు, పటేల్ చెరువు తండాలో రూ.10లక్షలు, పీరంపల్లిలో రూ.4లక్షలు, కామునిపల్లిలో రూ.5లక్షలు, కులకచర్లలో రూ.27లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు పనులకు భూమిపూజ చేశారు. అనంతరం అల్లాపూర్‌లో రోడ్డు ప్రమాదంలో గాయపడిన కార్యకర్తను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు, భరత్ కుమార్, గోపాల్‌నాయక్, యాదయ్య, విట్టల్ నాయక్, రవినాయక్, భరత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



కులకచర్ల: అల్లాపూర్‌లో మాట్లాడుతున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పరిశీలన

దోమ: మండలంలోని శివారెడ్డిపల్లిలో మంగళవారం లబ్ధిదారులు సుజాత, లావణ్య, షరీఫలకు చెందిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూర్ చేస్తుందని తెలిపారు. బేస్‌మెంట్ వరకు ఇంటి నిర్మాణం పూర్తి చేసిన లబ్ధిదారులకు లక్ష రూపాయలు బ్యాంకు ఖాతాల్లో జమ చేశామని తెలిపారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు

పూడూరు: మండలంలోని రాకంచర్ల తిరుమలనాథ స్వామి దేవస్థానంలోని యోగానంద లక్ష్మీనర్సింహ స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేకపూజల నిర్వహించారు. అనంతరం మాజీ సర్పంచ్ పెంటయ్య ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు.

రైతులు శాస్త్రవేత్తల సలహాలు పాటించాలి

మేడ్చల్ టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి) పంటకు సోకే చీడపీడల నివారణకు రైతులు వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించాలని వ్యవసాయశాఖ ఏవో అర్చన అన్నారు. మండలంలోని గోసాయిగూడ గ్రామంలో మంగళవారం రైతు ముంగిట్లో శాస్త్రవేతలు అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు వ్యవసాయ శాస్త్రవేతలు పాల్గొన్నారు.

తాండూరు రూరల్: వరిలో తడి, పొడి పద్ధతి ద్వారా దోమ పోటు ఉధృతిని తగ్గించడంతోపాటు 30 శాతం నీటిని ఆదా చేయవచ్చని తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి సూచించారు. బెల్కటూర్ రైతువేదికలో మంగళవారం తాండూరు మండల వ్యవసాయాధికారి కొమరయ్య అధ్యక్షతన రైతుముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన శాస్త్రవేత్తలు డాక్టర్ సుధారాణి, కె.శేఖర్, శాస్త్రవేత్త యమున మాట్లాడుతూ పలు సలహాలు, సూచనలు ఇస్తూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బెల్కటూర్ రైతులు నారాయణరెడ్డి, ప్రతినిధులు, నియోజకవర్గస్థాయి వ్యవసాయ విస్తీర్ణాధికారులు, పంచాయతీ కార్యదర్శి పార్వతమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

కీసర: కీసర రైతు వేదికలో మండల వ్యవసాయ అధికారి మాదవీలత రైతుముగింట్లో మంగళవారం శాస్త్రవేతలు కార్యక్రమం నిర్వహించారు. వడ్లను తడి, తాలు దుమ్ము లేకుండా తూర్పార బట్టి, ఆరబెట్టి మాత్రమే కొనుగోలు కేంద్రాలకు వడ్లను తీసుకురావాలని ఆమె తెలిపారు.

కొడంగల్ రూరల్: రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా బుధవారం(నేడు) కొడంగల్ మండల పరిధిలోని రుద్రారం రైతు వేదికలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి తులసి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వర్షాకాలం పంటల సాగుపై రైతులకు శాస్త్రవేత్తలు సలహాలు, సూచనలు చేయనున్నట్లు తెలిపారు.



సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారులు

అంధకారంలో కోట్‌పల్లి

కోట్‌పల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఏడాదిగా వీధిదీపాలు లేక గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామం ప్రధానవీధులు, బస్టాండ్‌లో రోడ్డుకు ఇరువైపులా గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన వీధిదీపాలు ప్రస్తుతం పనిచేయడంలేదు. ప్రత్యేకాధికారుల పాలనలో వీటిని పట్టించుకునేవారు కరువయ్యారని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



వీధిదీపాలు లేక చీకటిమయంలో కోట్‌పల్లి

గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించాలి



గ్రామంలో వీధిదీపాల నిర్వహణ చేపట్టి మౌలిక సదుపాయాలు కల్పించాలి. బస్టాండ్ ఆవరణలో ఐమాస్ట్ లైట్లు ఉన్నా వెలగడంలేదు. ఇదివరకు ఉదయం, సాయంత్రం తేడా లేకుండా వెలిగేవి. ఆన్ ఆఫ్ సిస్టమ్ ఏర్పాటు చేస్తే దీర్ఘకాలికంగా వెలిగేవి. బస్టాండ్ ఆవరణలో చీకట్లు కమ్ముకుని ప్రయాణికులకు ఇబ్బందికరంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

- పతంగే పాండు, సీనియర్ నాయకుడు

సార్వత్రిక సమ్మెకు సహకరించండి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మేడ్చల్ టౌన్, మే 13(ఆంధ్రజ్యోతి): ఈనెల 20న దేశవ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల కోసం నిర్వహిస్తున్న సార్వత్రికసమ్మె విజయవంతం చేయడానికి సహకరించాలని మంగళవారం సీఐటీయూ నాయకులు మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మేడ్చల్ మండల కన్వీనర్ ఎంపీ రమేష్ మాట్లాడుతూ.. ఈ సమ్మెలో పాల్గొనే మున్సిపల్ కార్మికులకు అధికారులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

తాండూరు: కార్మికుల చట్టాల అమలుకై జరుగుతున్న దేశ వ్యాప్త సమ్మెలో పాల్గొన్నాలని సీఐటీయూ పిలుపునిచ్చింది. మంగళవారం సీఐటీయూ, తెలంగాణ మున్సిపల్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ యూనియన్ ఆధ్వర్యంలో తాండూరు మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీస్ ఇచ్చారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

ఓటరు జాబితాపై సమీక్ష



మాట్లాడుతున్న తహసీల్దార్

కొడంగల్, మే 13 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపు తదితర వాటిపై తహసీల్దార్ విజయ్‌కుమార్ సమావేశం నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమీక్షించారు. 18 సంవత్సరాలు నిండిన అర్హులైన ప్రతీ ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేందుకు రాజకీయ నాయకులు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ అనిత పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



నవాబుపేట: పూజల్లో గ్రామస్తులు

నవాబుపేట, మే 13 (ఆంధ్రజ్యోతి): భారత్-పాక్ యుద్ధ వాతావరణ పరిస్థితుల్లో భాగంగా భారత సైన్యానికి మద్దతుగా గ్రామస్థులు పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని శ్రీ సద్గురు మాణిక్యప్రభు ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించి సైనికులు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

పోలేపల్లి ఎల్లమ్మ ఆలయంలో..

యాలాల: పోలేపల్లి ఎల్లమ్మ ఆలయాన్ని యాలాల మండల నాయకులు సందర్శించి, అమ్మవారిని మంగళవారం దర్శించుకున్నారు. యాలాల మండలానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు పేరి రాజేందర్‌రెడ్డి, జిల్లా కో-ఆప్షన్ల సంఘం మాజీ అధ్యక్షుడు అక్బర్‌బాబా, ఏఎంసీ డైరెక్టర్ గోనెగారి శ్రీనివాస్, గ్రామ కమిటీ అధ్యక్షుడు రాపోల్ నాగయ్య, కార్యదర్శి హైమద్, సహాయ కార్యదర్శి గొల్ల చందు అమ్మవారిని దర్శించుకున్నారు.



యాలాల: పోలేపల్లి అమ్మవారి ఆలయ సందర్శనలో కాంగ్రెస్ యాలాల మండల నాయకులు

రేపు గురుకులంలో ప్రవేశాలకు కౌన్సిలింగ్

కొడంగల్/కులకచర్ల, మే 13 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని పాత కొడంగల్ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర జూనియర్ కళాశాల, కులకచర్ల మండలం బండవెల్కిచర్ల గిరిజన సంక్షేమ గురుకుల బాలుర జూనియర్ కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో 205-26 విద్యాసంవత్సరానికి ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశాలకు స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు శ్రీనివాసులు, లక్ష్మీకాంత్‌రెడ్డి మంగళవారం వేర్వేరు ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం(రేపు) ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని హయత్‌నగర్ వీజీటీజీ కళాశాలలో కౌన్సిలింగ్ ఉంటుందని, ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

చెంగోల్‌లో క్రికెట్ టోర్నమెంట్

తాండూరు రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెంగోల్ గ్రామంలో బీఎంఆర్ విలేజ్ క్రికెట్ టోర్నమెంట్‌ను గురువారం (రేపు) నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రాము, పోచన్న, తదితరులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు ఆసక్తిగల వారు ఎంట్రీ ఫీజు రూ.1500లు చెల్లించాలని తెలిపారు. టోర్నమెంట్ విన్నర్ ప్రైజ్ రూ.30వేలు, రన్నర్ ప్రైజ్ రూ.15వేలు, బెస్ట్ బ్యాట్స్‌మెన్ ట్రోఫీ, బెస్ట్ బౌలర్ ట్రోఫీ అందజేయనున్నట్లు తెలిపారు. వివరాలకు సెల్: 9885954394, 9849487732 నెంబర్లకు సంప్రదించాలని వారు కోరారు.

క్రైం కార్నర్

ఉరేసుకొని యువకుడి మృతి

బంట్వారం మే 13 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో చెట్టుకు ఉరేసుకొని యువకుడు మృతిచెందిన ఘటన బంట్వారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలాఉన్నాయి. మండలంలోని తొర్మామిడికి చెందిన పోచారం గోవర్ధన్‌రెడ్డి(35) సోమవారం రాత్రి 7గంటలకు ఇంట్లో నుంచి పొలం దగ్గరకి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో ఉదయం పొలం వద్దకు వెళ్లి చూడగా చెట్టుకు ఉరేసుకొని మృతిచెంది ఉండటంతో స్థానికులు గమనించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి జేబులో ఒక సూసైడ్‌నోట్ ఉందని వారు చెప్పారు. కుటుంబ సమస్యలు భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నట్లు అందులో పేర్కొన్నాడు. మృతుడి అన్న నర్సింహారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీశైలం తెలిపారు. పోస్టుమార్టం కోసం మర్పల్లి ప్రభుత్వం ఆస్పత్రికి తరలించి కుటుంబ సభ్యులకి అప్పగిస్తామని పోలీసులు తెలిపారు.

బైక్‌పై నుంచి పడి వ్యక్తి..

మేడ్చల్ టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి) బైక్‌పై నుంచి పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మెదక్ జిల్లా గుమ్మడిదల్ల గ్రామానికి చెందిన దేవేందర్‌రెడ్డి రాయిలాపూర్‌లో ప్యాడీ హార్వెస్టర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి విధులు నిర్వహించి తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో బండమాదారం గ్రామ రామిరెడ్డి బావి వద్ద బైక్‌పై నుంచి కిందపడి తీవ్రగాయాలపాలై మృతిచెందాడు. మంగళవారం రోడ్డుపై పడి ఉన్న దేవేందర్‌ను చూసి స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ జరిపి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వివాహిత అదృశ్యం

ఘట్‌కేసర్ రూరల్, మే 13(ఆంధ్రజ్యోతి): వివాహిత అదృశ్యమైన ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. చౌదరిగూడకు చెందిన ఎర్ర నరేష్‌కు 15యేళ్ల కిందట నవ్య అలియాస్ సుమతో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు. కాగా ఈనెల 3వ తేదీన రాత్రి నవ్య ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఫోన్‌చేస్తే స్విచ్ఛాఫ్ రావడంతో నరేష్ బంధువులను విచారించినా ఫలితం లేకుండాపోయింది. దీంతో మంగళవారం పోచారం ఐటీసీ పోలీసులను ఆశ్రయించాడు. చౌదరిగూడకు చెందిన అన్నంపట్ల ప్రదీప్‌పై అనుమానం ఉందని పేర్కొన్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బీటెక్ విద్యార్థి..



తోట కిరణ్ కుమార్

మేడ్చల్ టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి): ఇంటికి వెళ్తానని హాస్టల్ నుంచి బయల్దేరిన ఓ బీటెక్ విద్యార్థి తప్పిపోయిన ఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే మెదక్ జిల్లా నార్సింగి గ్రామానికి చెందిన గోట కిరణ్‌కుమార్ కండ్లకోయ సమీపంలోని హాస్టల్‌లో నివాసముంటూ సీఎంఆర్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. రెండు రోజుల కిందట ఇంటికి వెళ్తనని హాస్టల్ నుంచి బయల్దేరిన కిరణ్ కుమార్ ఇంటికి చేరకపోవటంతో కుటుంబసభ్యులు అతడి కోసం గాలించారు. విద్యార్థి తండ్రి భాగయ్య మంగళవారం మేడ్చల్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

యాలాల, మే 13 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నట్లు యాలాల ఎస్ఐ గిరి తెలిపారు. భాగాయిపల్లి శివారులో జి.జగదీష్, నరేష్‌లు సోమవారం రాత్రి డ్యూటీ నిర్వహిస్తున్నారు. అదే సమయంలో బొంరాస్‌పేట్ మండలం తుంకిమెట్ల గ్రామానికి చెందిన మద్దూరు రాజు తన టిప్పర్ వాహనంలో ఇసుక తరలిస్తున్నాడు. అతడి వద్ద ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకపోవడంతో టిప్పర్‌ను అదుపులోకి తీసుకుని యాలాల పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గిరి తెలిపారు.

సెల్‌టవర్ బ్యాటరీలు చోరీ

ఘట్‌కేసర్ రూరల్, మే 13(ఆంధ్రజ్యోతి): సెల్‌టవర్ బ్యాటరీలు చోరీకి గురైన ఘటన పోచారం ఐటీకారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కొర్రెములలోని ఎయిర్‌టెల్ సంస్థకు చెందిన ఇండస్ టవర్ వద్ద ఈనెల 7న అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు 24ఎక్సైడ్ బ్యాటరీలను అపహరించుకెళ్లారు. మరుసటి రోజు ఉదయం సెక్యూరిటీ విధులు నిర్వహిస్తున్న ధారా అజయ్‌కుమార్ చూసేసరికి బ్యాటరీలు కనిపించలేదు. దీంతో ఆయన పోలీసులను మంగళవారం ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజువర్మ తెలిపారు.

భార్యను కిడ్నాప్ చేశారని ఫిర్యాదు

ఘట్‌కేసర్ రూరల్, మే 13(ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకున్న తన భార్యను ఆమె కుటుంబసభ్యులు కిడ్నాప్ చేశారని భర్త పోలీసులను ఆశ్రయించాడు. ఈ ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోచారం మున్సిపాలిటీ, వెంకటాద్రిటౌన్‌షిప్‌కు చెందిన కారు డ్రైవర్ మేడికంటి రామూర్తి, చౌదరిగూడలోని ప్రిన్‌స్టన్ కళాశాలలో బీటెక్ సెకండియర్ చదువుతున్న వడ్ల అమృతను ప్రేమించి ఈనెల 5న పెళ్లి చేసుకున్నాడు. వెంకటాద్రిటౌన్‌షిప్‌లోని ఆయన నివాసంలో ఉంటున్నారు. ఈ నెల 12న అమృత పెద్దన్న నితిన్, ఆమె తల్లి రజిత వారుంటున్న ఇంట్లోకి అక్రమంగా చొరబడి ఆమెపై దాడిచేసి అక్కడి నుంచి లాక్కెల్లారు. అడ్డుకున్న ఆమె అత్తామామలపై దాడిచేసి అమృతను ఎత్తుకెళ్లారు. దీంతో భర్త మేడికంటి రామూర్తి పోచారం ఐటీ కారిడార్ పోలీసులను ఆశ్రయించి తన భార్యను కిడ్నాప్‌కు యత్నించిన వారిపై ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజువర్మ తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదెలు మృత్యువాత

ఘట్‌కేసర్ రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృత్యువాతపడ్డాయి. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎదులాబాద్ గ్రామానికి చెందిన మీరాల రామయ్యకు చెందిన రెండు పాడి గేదెలు మంగళవారం గ్రామ శివార్లలోని సాగు నీటి కాలువ వద్ద అమర్చిన నీటి మోటార్ల వైర్లు కాలువలో పడటంతో మంగళవారం సాయంత్రం అక్కడ నీరు తాగడానికి వెళ్లిన గేదెలు విద్యుదాఘాతానికి గురై మృత్యువాతపడ్డాయి. గేదెల విలువ సుమారు రూ.రెండు లక్షలు ఉంటుందని బాధితుడు తెలిపారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో వందశాతం ఉతీర్ణత

కీసర, మే 13 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ బోర్డు ప్రకటించిన పదోతరగతి పరీక్షా ఫలితాల్లో రాంపల్లి దాయరలోని జూబ్లిహిల్స్ పబ్లిక్ స్కూల్ వందశాతం ఉతీర్ణత సాధించినట్లు పాఠశాల నిర్వాహకులు తెలిపారు. మంగళవారం విడుదల అయిన పరీక్ష ఫలితాల్లో మొత్తం 44 మంది విద్యార్థులకు 19 మంది విద్యార్థులు 75 శాతం మార్కులతో డిస్టింక్షన్ సాధించారని తెలిపారు. నిహారిక అనుగు 90.2 మార్కులతో స్కూల్ టాపర్‌గా నిలిచినట్లు పాఠశాల ప్రిన్సిపల్ సంతోష్ తెలిపారు. ఈ మేరకు ఉతీర్ణత సాధించిన విద్యార్థులను పాఠశాల బృందం అభినందనలు తెలిపారు.